సాక్షి
కుమురం భీం

సోమవారం ၊ 11 ၊ సెప్టెంబర్ ၊ 2023



హడలెత్తిస్తున్నారు

కొంతమంది యువకులు స్పోర్ట్స్ బైక్‌లతో ప్రజలను హడలెత్తిస్తున్నారు. స్టంట్లు చేస్తూ.. హారన్ కొడుతూ పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తున్నారు. 8లో▸



ఆరోగ్యానికి పోషకాహారం!

జిల్లాలో పోషక మాసోత్సవం కొనసాగుతోంది. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. 9లో▸



వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బెజ్జూర్‌లో ట్రెయినీ అధికారుల పర్యటన



అటవీప్రాంతంలో ట్రెయినీ అధికారులు

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ రేంజ్ పరిధిలోని అడవుల్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ దూలపల్లి(హైదరాబాద్)లో శిక్షణ పొందుతున్న ట్రెయినీ బీట్ అధికారులు పర్యటించారు. మత్తడివాగు స్ప్రింగ్ ఆనకట్టతోపాటు ఇందిరిగం బీట్‌లోని రాముడు, భీముడు చెట్లను వారు పరిశీలించారు. రెండు రోజులపాటు ట్రెయినీ అధికారులు అడవుల్లో పర్యటిస్తారని ఎఫ్ఆర్‌వో దయాకర్ తెలిపారు. కార్యక్రమంలో టూర్ ఇన్‌చార్జి ఉమారాణి తదితరులు ఉన్నారు.

బీజేపీ టికెట్‌కు కొత్తపల్లి శ్రీనివాస్ దరఖాస్తు



దరఖాస్తు ఇస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నుంచి పోటీ చేసేందుకు బీజేపీ టికెట్ కోసం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. 2018లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బీసీ బిడ్డగా తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు.

దరఖాస్తు సమర్పించిన 'పాల్వాయి'

సిర్పూర్ బీజేపీ టిక్కెట్ కోసం పాల్వాయి హరీశ్‌బాబు దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం తన దరఖాస్తు సమర్పించారు. బీజేపీ తరఫున బరిలో ఉంటానని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

20 నుంచి టీఆర్టీ ఉచిత శిక్షణ



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

కాగజ్‌నగర్‌టౌన్: కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నమూనా టెట్ పేపర్- 1 ప్రశాంతంగా ముగిసింది. ఆగస్టు 13, 20, 27, సెప్టెంబర్ 3, 10 తేదీల్లో ఐదు వారంతపు పరీక్షలు విజయవంతంగా పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ నెల 20 నుంచి టీఆర్టీ ఉచిత శిక్షణ అందించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో అర్హత కలిగిన అభ్యర్థులు ఈ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేలిముద్ర వేయాల్సిందే!



- రేషన్ లబ్ధిదారులు ఈ- కేవైసీ చేసుకోవాలని ప్రభుత్వ ఆదేశం
- ఈ- పాస్ యంత్రంతో కుటుంబ సభ్యుల వేలిముద్రల అప్‌డేట్
- అనర్హుల వివరాల తొలగింపునకు చర్యలు
- జిల్లాలో 1,39,877 రేషన్‌కార్డులు
- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం



ఆసిఫాబాద్: రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత కోసం తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో ఈ- కేవైసీ అమలుకు శ్రీకారం చుట్టింది. కార్డుదారుడితోపాటు కార్డులో పేరు ఉన్న ప్రతిఒక్కరూ రేషన్ దుకాణానికి వెళ్లి కేవైసీ సమర్పించాలని పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. కుటుంబ సభ్యులందరూ రేషన్ దుకాణాలకు వెళ్లి వేలిముద్ర వేసి ఈ- కేవైసీ సమర్పిస్తేనే బియ్యం పంపిణీ చేయనున్నారు.

314 రేషన్ దుకాణాలు

జిల్లా వ్యాప్తంగా 314 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,39,877 రేషన్ కార్డులు, 4,61,599 యూనిట్లు ఉన్నాయి. వీటిలో 1,26,805 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు, 13,066 అంత్యోదయ అన్న యోజన కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు 6 కిలోల చొప్పున ప్రతినెలా 2,960.906 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే జిల్లాలోని కొన్ని కుటుంబాలకు చెందిన కార్డుల్లో మృతి చెందినవారు, వివాహాలైన వారి పేర్లు కూడా కొనసాగుతున్నాయి. కేవైసీ పునరుద్ధరణలో అసలైన లబ్ధిదారులకు బియ్యం అందించేందుకు అనర్హుల వివరాలు తొలగించనున్నారు. చనిపోయినవారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లనూ తొలగించనున్నారు. కేవైసీ ప్రక్రియను సోమవారం నుంచి జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదేశించారు.

కుటుంబ సభ్యుల వేలిముద్రలు సైతం..

కేవైసీ పునరుద్ధరణకు పౌరసరఫరాల శాఖ చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే రేషన్ డీలర్లకు కేవైసీ పునరుద్దరణ గురించి ఈ- పాస్ యంత్రంపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. కేవైసీ పునరుద్దరణకు రేషన్ కార్డు కలిగిన కుటుంబంలోని సభ్యులందరూ రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ- పాస్ యంత్రంపై వేలిముద్ర సమర్పించాలి. ఈ- పాస్ యంత్రాల్లో ఈ కేవైసీ అనే కొత్త అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచారు. లబ్ధిదారు రేషన్ దుకాణానికి కార్డు నంబర్, ఆధార్ నంబర్ సమర్పించాలి. లబ్ధిదారు ఆధార్ కార్డు అప్‌డేట్ పూర్తయితేనే కార్డులో పేరు కొనసాగుతోంది. లేనిపక్షంలో కార్డు నుంచి లబ్ధిదారుడి పేరు తొలగించనున్నారు. ఈ ప్రక్రియలో అర్హులైన వారి పేర్లు కార్డులో ఉంచి, కేవైసీ సమర్పించని వారి పేర్లు తొలగించనున్నారు. కొంతమంది వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు ఇళ్లకే పరిమితమైన నేపథ్యంలో అలాంటి వారి కోసం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేవైసీ ప్రక్రియ పూర్తయితే కొత్త రేషన్ కార్డుల జారీతోపాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో కొత్త వారి పేర్ల నమోదుకు అవకాశం లభిస్తుంది. సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో కేవైసీ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు.

'బోగస్' యూనిట్ల ఏరివేత

రేషన్ కార్డుదారులు కేవైసీ సమర్పిస్తే కార్డుల్లోని బోగస్ యూనిట్లను గుర్తించేందుకు అవకాశం కలగనుంది. దీని ఆధారంగా అసలైన లబ్ధిదారులకు సరుకులు అందడంతోపాటు కొత్తవారికి అవకాశం లభించనుంది. ఈ ప్రక్రియ పూర్తయితే చనిపోయినవారు, వివాహాలైన వారి పేర్లు కార్డు నుంచి తొలగించేందుకు మార్గం సుగమం అవుతుంది. రాష్ట్రంలో కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం అనేకమంది దరఖాస్తులు సమర్పిస్తున్నారు. వివాహాలైన వారు, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు కూడా దరఖాస్తులు చేసుకుని కొత్త కార్డుల కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. వీరితోపాటు కుటుంబంలో పుట్టిన పిల్లల పేర్లు కూడా నమోదు చేయాలని దరఖాస్తులు వస్తున్నా ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అనర్హులను తొలగించి అర్హులకు రేషన్‌కార్డులు జారీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధమవుతోంది.

ప్రబలుతున్న జ్వరాలు

- విద్యుత్ కోతలతో దోమల మోత
- పారిశుధ్య లోపంతో అధ్వానంగా పల్లెలు
- విజృంభిస్తున్న డెంగీ, మలేరియా, టైఫాయిడ్
- నివారణ చర్యలు తీసుకోని యంత్రాంగం





చింతలమానెపల్లి మండలం నందికొండ గ్రామానికి చెందిన భీంరావుకు జ్వరం రావడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. కొద్దిగా కోలుకోవడంతో ఇంటికి వెళ్లాడు. మళ్లీ ఆరోగ్య పరిస్థితి విషమించి పదిరోజుల క్రితం ఇంటి వద్ద మృతి చెందాడు. భీంరావు మరణంతో భార్య, పిల్లలు పెద్ద దిక్కును కోల్పోయారు.

చింతలమానెపల్లి(సిర్పూర్): పల్లెలు మంచం పడుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఫ్లూజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతోపాటు గ్రామీణ మండలాల్లోని ప్రజలు జ్వరాలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. నాణ్యమైన వైద్యం అందక ఇటీవల పెంచికల్‌పేట్ మండలంలోని కొండెపల్లిలో ఓ మహిళ, చింతలమానెపల్లి మండలం నందికొండలో యువకుడు మృత్యువాత పడ్డారు. అయితే జిల్లావ్యాప్తంగా జ్వరాల వ్యాప్తిపై అధికారికంగా రికార్డులు లేవు. కేవలం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోని పరీక్షలనే రికార్డులుగా అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్న వారే అధికంగా ఉండటం గమనార్హం.

జ్వరాల వ్యాప్తి

గ్రామీణ మండలాల్లో విద్యుత్ సరఫరా అంతరాయంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ కారణంగానే దోమలతో వ్యాప్తిచెందే మలేరియా, డెంగీ విజృంభిస్తున్నాయి. కలుషితమైన వాతావరణం, ఆహారం కారణంగా టైఫాయిడ్ వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. వాతావరణ మార్పులతో చిన్నారులపై ఫ్లూజ్వరం ప్రభావం చూపుతోంది. జలుబు, దగ్గు, స్వల్ప జ్వరంతో అస్వస్థతకు గురవుతున్నారు. టైఫాయిడ్ సోకిన వ్యక్తికి తీవ్రమైన జ్వరం, వాంతులు, విరోచనాలు ఉంటాయి. డెంగీ వ్యాధిగ్రస్తులకు జ్వరంతోపాటు ఒళ్లు నొప్పులు, కళ్ల వెనుక భాగంలో తలనొప్పి ఉంటుంది. వీపు భాగంలో దద్దుర్లు, మచ్చలను కూడా గమనించవచ్చు. మలేరియా బారిన వారిలో చలి జ్వరం ఎక్కువగా ఉంటుంది.

పీహెచ్‌సీల్లో పరీక్షలు

టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలకు బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాపిడ్ పరీక్షల ద్వారా మలేరియాను నిర్ధారిస్తున్నా.. టైఫాయిడ్, డెంగీ శాంపిళ్లను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఫలితాలు రావడానికి ఒక రోజు సమయం పడుతోంది. దీంతో కొన్నిచోట్ల అనుమానిత లక్షణాల ఆధారంగానే చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

కట్టడి చర్యలేవి.?

జ్వరాల కట్టడికి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు పంచాయితీ కార్యాలయాల్లో ఉన్నాయి. ప్రమాదాలు జరుగుతుండడంతో ఫాగింగ్ నిలిచిపోయింది. మరోవైపు పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడం కూడా దోమలు ఉధృతికి కారణమవుతోంది. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో కలుషిత నీరే ప్రజలకు దిక్కవుతోంది.

డెంగీతో ఒకరి మృతి

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ గ్రామానికి చెందిన గోలేటి మారుతి(42) డెంగీతో ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతికి నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్నాడు. జ్వరం తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఈస్‌గాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మంచిర్యాలకు తీసుకెళ్లగా అక్కడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య శారద, కుమార్తె ఉన్నారు. కాగా.. మారుతి తెలంగాణ సాంస్కృతిక సారథిలో కళాకారుడిగా 20 ఏళ్లుగా సేవలందిస్తున్నాడు.

నియంత్రణకు చర్యలు

జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. తిర్యాణి వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎలిసా పరీక్ష ద్వారా డెంగీని కచ్చితంగా నిర్ధారిస్తున్నాం. ఈ ఫలితాలకు అనుగుణంగా చికిత్స అందిస్తున్నాం.

– కృష్ణప్రసాద్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

వీరవనిత చాకలి ఐలమ్మ

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే సక్కు, తదితరులు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ అని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఆదివారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీసీ సంక్షేమశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి రమాదేవి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెత్తందారు విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి, ఆత్మగౌరవ నినాదాన్ని ఎత్తుకున్న వీరవనిత ఐలమ్మ అని అన్నారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం రాష్ట్రంలో పోరాటయోధులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఐలమ్మను గుర్తు చేసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎంపీపీ మల్లికార్జున్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్మార్ట్.. హాజరు

- ఫేషియల్ యాప్‌తో విద్యార్థుల అటెండెన్స్
- ప్రభుత్వ పాఠశాలల్లో అమలు
- స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ ద్వారా ప్రక్రియ
- అవకతవకలకు ఇక నో ఛాన్స్
- త్వరలో ఉపాధ్యాయులకు కూడా..



ఫేషియల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో ఇక నుంచి విద్యార్థులకు ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్ఏ)ను అమలు చేయనున్నారు. స్కూళ్లలో బయోమెట్రిక్ ద్వారా అటెండెన్స్ కొనసాగుతుండగా, కరోనా తర్వాత ఈ ప్రక్రియ అమలు కావడం లేదు. ఈ క్రమంలో ఆయా పాఠశాలల్లో పథకాల అమలులో కచ్చితత్వం, అవకతవకలకు చెక్ పెట్టేందుకుగాను ఈ ఫేషియల్ యాప్‌ను రూపొందించారు. సోమవారం నుంచి జిల్లాలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. విద్యార్థి ముఖంలోని కనురెప్పలు, పెదాలు, ముక్కు, తదితర అవయవాలను స్కాన్ చేస్తారు. బయోమెట్రిక్ హాజరు సమయం ఎక్కువ తీసుకుంటుండగా, ఈ యాప్ ద్వారా సత్వరం పూర్తవుతుంది. ఉపాధ్యాయుల వద్ద ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్స్, ట్యాబ్‌ల ద్వారా విద్యార్థుల ముఖాలను స్కాన్‌చేస్తే హాజరు నమోదవుతుంది. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు క్షణాల్లో ఈ వివరాలన్నీ చేరుతాయి. ఎంత మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. హాజరు శాతం తదితర వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి.

రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా..

పాఠశాల విద్యాశాఖ ఇదివరకు పైలెట్ ప్రాజెక్ట్‌గా రెండు జిల్లాల్లో ఈ యాప్ ద్వారా విద్యార్థుల హాజరుకు శ్రీకారం చుట్టింది. అక్కడ సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి అమలుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే విద్యాశాఖాధికారులు సంబంధిత పాఠశాలల హెచ్ఎంలకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఈ విధానం ద్వారా హాజరు తీసుకోనున్నారు. నెట్వర్క్ లేని పాఠశాలల్లో ఆఫ్‌లైన్ విధానంలో హాజరు తీసుకునే వెసులుబాటు కల్పించారు.

యాప్ పనితీరు ఇలా..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి 'డీఎస్ ఈ–ఎఫ్ఆర్ఎస్' పేరిట ఉన్న ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఉపయోగించి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. విద్యార్థుల రిజిస్ట్రేషన్, హాజరు, డిటేల్ రిపోర్టు అనే ఆప్షన్లు ఉంటాయి. ఓ తరగతి గదిలో ఉన్న విద్యార్థుల వివరాలన్నీ యాప్‌లో నమోదవుతాయి. ఒక్కో విద్యార్థి పేరు క్లిక్ చేస్తే కెమెరా ఓపెన్ అవుతుంది. విద్యార్థి ముఖం రౌండ్ సర్కిల్‌లో ఉండేలా చూడడంతో పాటు ముఖం చుట్టూ ఎరుపు రంగు నుంచి ఆకుపచ్చ రంగు వస్తే హాజరు నమోదవుతుంది.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	ఉపాధ్యాయులు
ఆదిలాబాద్	702	64,721	2,480
మంచిర్యాల	739	40,394	2,382
నిర్మల్	735	59,000	2,416
కుమురంభీం	684	42,015	1,883

అవకతవకలకు చెక్..

పాఠశాలల్లో ఇదివరకు బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తుండగా, కరోనా తర్వాత ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రస్తుతం ఉపాధ్యాయులకు మాత్రమే బయోమెట్రిక్ హాజరు ఉన్నప్పటికీ కొంతమంది టీచర్లు ఉపయోగించడం లేదు. మరమ్మతుల పేరిట ఈ యంత్రాలను మూలన పడేశారు. ఈ క్రమంలో విద్యార్థుల హాజరు ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు ఫేస్ యాప్‌ను ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. దీనిద్వారా ప్రతిరోజు ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారనే విషయం తెలుస్తోంది. అలాగే మధ్యాహ్నం ఎంత మందికి భోజనం పెట్టారనే వివరాలు తెలిసిపోనున్నాయి. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకపోయినప్పటికీ కొంత మంది ఉపాధ్యాయులు హాజరు పట్టికలో హాజరు వేస్తున్నారు. ఇలా బిల్లులు అదనంగా కాజేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అయితే ఈ యాప్ ద్వారా ఇలాంటి అవకతవకలకు చెక్ పడనుంది. బోగస్ సంఖ్యను ఇట్టే గుర్తించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు లేనప్పటికీ కొంత మంది ఉపాధ్యాయులు పోస్టులను కాపాడేందుకు ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్, స్కాలర్‌షిప్ వంటివి ఎంత మందికి అందించారనే విషయం కూడా ఇట్టే తెలిసిపోనుంది. అలాగే ఉపాధ్యాయులకు సైతం త్వరలో ఈ యాప్ ద్వారా హాజరు నమోదు చేపట్టనున్నారు. తద్వారా దుమ్మా పంతుళ్లకు చెక్ పడనుంది.

త్వరలోనే అమలు చేస్తాం



విద్యార్థుల హాజరు కోసం విద్యాశాఖ ఫేషియల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థుల ముఖాలను యాప్ ద్వారా స్కాన్ చేయడంతో వారి హాజరు ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. టీచర్లకు యాప్‌పై అవగాహన కల్పించి, త్వరలోనే జిల్లాలో అమలు చేస్తాం.

– అశోక్, డీఈవో, కుమురంభీం జిల్లా

అంగన్‌వాడీల సమ్మెబాట

- నేటి నుంచి నిరవధిక ఆందోళనలు
- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్
- జిల్లాలో 890 మంది టీచర్లు, 101 మంది హెల్పర్లు



కలెక్టర్ హేమంత్ బోర్కడేకు సమ్మె నోటీసు అందిస్తున్న అంగన్‌వాడీలు(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు నేటి నుంచి సమ్మెబాట పట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రిటైర్మెంట్ పాలసీని వ్యతిరేకిస్తూ విధులు బహిష్కరించనున్నారు. కనీస వేతనాలు, సమస్యల పరిష్కారం కోసం పోరుకు సిద్ధమవుతున్నారు. సెప్టెంబర్ 11 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ కమిషనర్‌కు జేఏసీ నాయకులు సమ్మె నోటీసు అందించారు.

రిటైర్మెంట్ ప్యాకేజీపై వ్యతిరేకత

గత నెలలో జేఏసీ నాయకులు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల డిమాండ్లపై ప్రభుత్వంతో చర్చలు జరిపారు. మంత్రి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో అంగన్‌వాడీ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. రిటైర్మెంట్ పొందే అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున సాయం అందజేస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. అయితే ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పాలసీలో రిటైర్మెంట్ వయస్సును 65 ఏళ్లుగా నిర్ధారించారు. పదవీ విరమణ పొందిన టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50వేల చొప్పున ఆర్థికసాయం, ఆసరా పెన్షన్ అందించనున్నట్లు ప్రకటించింది. దీనిని అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం ముందుగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా రిటైర్మెంట్ సాయంలో సగానికి కోత పెట్టిందంటూ మండిపడుతున్నారు.

ప్రధాన డిమాండ్లు

- రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. 2017 నుంచి ఇంక్రిమెంట్, అలవెన్స్ బకాయిలు చెల్లించాలి.
- సీనియారిటీ ప్రకారం వేతనాల పెంపుతోపాటు ఇంక్రిమెంట్లు ప్రకటించాలి. మూడేళ్ల రేషన్‌షాపు ట్రాన్స్‌పోర్టు చార్జీలు చెల్లించాలి.
- ఐసీడీఎస్ పథకానికి నిధులు పెంచాలి. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలి.
- పీఆర్సీ, ఏరియర్స్‌కు సంబంధించి 2021 జూలై, అక్టోబర్, నవంబర్ నెలల బకాయిలు చెల్లించాలి.
- రిటైర్మెంట్ నాటికి తీసుకునే వేతనంలో సగం వరకు పెన్షన్‌గా ఇవ్వాలి.
- విరమణ వయస్సు 60 ఏళ్లకు కుదించి, టీచర్‌కు రూ.10 లక్షలు, హెల్పర్‌కు రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలి.
- జీవోలు 14, 19, 8 సవరించాలి. హెల్త్‌కార్డులు, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ మంజూరు చేయాలి.
- కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ధారించాలి.

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మెయిన్	834
మినీ	139
అంగన్‌వాడీ టీచర్లు	890
హెల్పర్లు	101

డిమాండ్లు నెరవేర్చాలి



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి. ప్రభుత్వం ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీ సరిగా లేదు. చర్చల సమయంలో చెప్పిన సాయంలో ప్రస్తుతం నిర్ధారించిన మొత్తం సగం ఉంది. కనీస వేతనాలు పెంచి వెంటనే అమలు చేయాలి. విరమణ పొందే వారికి వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలి.

– జాదవ్ రాజేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

డల్లాస్‌లో 'బండి'కి ఘనస్వాగతం


స్వాగతం పలుకుతున్న ఎన్‌ఆర్‌ఐలు

దండేపల్లి: తెలంగాణ ఎన్‌ఆర్‌ఐల మద్దతు కోసం విదేశీ పర్యటనలో భాగంగా అమెరికా వెళ్లిన బీజేపీ తెలంగాణ మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు ఆదివారం డల్లాస్‌లో ఎన్‌ఆర్‌ఐలు ఘన స్వాగతం పలికారు. డల్లాస్ చేరుకున్న ఆయనకు దండేపల్లి మండల వాసి సుమంత్‌రెడ్డితో పాటు తెలంగాణ ఎన్‌ఆర్‌ఐలు ఘనస్వాగతం పలికారు.

ప్రశాంతంగా శాంపిల్ మజ్దూర్ రాత పరీక్ష


పరిశీలిస్తున్న డీజీఎం అరవిందరావు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న శాంపిల్ మజ్దూర్ పోస్టుకు సీసీసీ సింగరేణి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీజీఎం పర్సనల్ అరవిందరావు తెలిపారు. పరీక్షకు ఇంటర్నల్ అభ్యర్థులు 109 మంది దరఖాస్తు చేసుకోగా 77 మంది హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఫలితాలను విడుదలచేసి పాఠశాల బోర్డుకు అతికించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఇన్‌చార్జి క్వాలిటీ హనుమాన్‌గౌడ్, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, అధికారులు రాజేశ్, దేవేందర్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మాదిగల సత్తా చాటుతాం


మాట్లాడుతున్న నరేష్

దండేపల్లి: రానున్న ఎన్నికల్లో మాదిగల సత్తా చాటుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు మాదిగలను కేవలం ఓటు బ్యాంకు కోసం మాత్రమే వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మాదిగలను మోసం చేస్తే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, మండల అధ్యక్షుడు తుంగపిండి ప్రశాంత్, నాయకులు ముల్కల్ల నరేష్, కొల్లూరి రవి, దర్శనాల నవీన్, విక్రమ్, సతీష్, శేఖర్, భూమేష్, మహేష్, శ్రీకాంత్, రాజేశ్, రఘు, పవన్, శివాజీ, కిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్నారు

- పరిమితికి మించి వాహనాల మోత, ఆపై స్టంట్లు
- శబ్ద కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- హారన్, సైలెన్సర్ల శబ్దాలతో ఉలిక్కిపడుతున్న ప్రజలు


పరిమితికి మించిన శబ్దంతో స్టంట్లకు పాల్పడిన వాహనాలను సీజ్ చేస్తున్న ఎస్సై జగదీష్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: రోజురోజుకూ రోడ్లపై శబ్ద కాలుష్యం పెరుగుతోంది. రణగొణ ధ్వనులు చెవుల్లో చిల్లులు పొడుస్తున్నాయి... కాలం చెల్లిన వాహనాలు, ఇటీవల మార్కెట్లోకి స్పోర్ట్స్ బైక్‌ల వింతైన హారన్ మోతలు, ఆపై స్టంట్లు (ప్రమాదకరమైన విన్యాసాలు) చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నారు. పట్టణాల్లో కొంతమంది యువకులు కొత్త మోడల్ బైకులకు కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్లను తొలగించి భారీ శబ్దం వచ్చేవి అమరుస్తున్నారు. మరికొందరు హ్యాండిల్ వద్ద ప్రత్యేక బటన్ ఏర్పాటు చేసుకుని వింతైన శబ్దాలతో రయ్‌మని దూసుకెళ్తున్నారు. దీంతో రోడ్లపై నడువాలంటేనే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రోజురోజుకూ యువకుల ఆగడాలు శృతిమించి పోతున్నాయి.

అరికట్టడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలం

వాహనదారులకు అవగాహన కల్పించి వారిలో మార్పు తేవాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం ఫొటోలకే పరిమితమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. పోలీస్, రవాణశాఖ మామూలుగా తీసుకోవడంతోనే యువత ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలో అన్ని వాహనాలు కలిపి సుమారు లక్షకు పైగా ఉన్నాయి. అందులో 25వేలకు పైగా ద్విచక్ర వాహనాలే ఉండడం గమనార్హం. వీటిలో చాలామట్టుకు సరైన పత్రాలు లేవు. ఫిట్‌నెస్ సరిగా లేకపోవడంతో వాటిని మెకానిక్‌ల వద్ద రకరకాల మోడళ్లలో తయారు చేయించి విపరీతమైన శబ్దకాలుష్యాన్ని సృష్టిస్తున్నారు. ఈ నెల 6న జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్‌లో నలుగురు యువకులు కేటీఎం, స్పోర్ట్స్ బైక్‌లపై మితిమీరిన శబ్దాలతో స్టంట్లు చేస్తుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు ఎస్సై జగదీష్ వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా బైక్‌లను అక్కడే వదిలేసి పారిపోయారు. దీంతో బైక్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

శబ్ద కాలుష్యం అవధి (డెసిబుల్స్‌లో)		
ప్రాంతం	పగలు	రాత్రి
పారిశ్రామిక	75	70
వాణిజ్య	65	55
నివాస గృహాల్లో	55	45
నిశ్శబ్ద ప్రాంతం	50	40

ఇవీ నిబంధనలు

పర్యావరణ నిబంధనల చట్టం ప్రకారం ద్విచక్ర వాహనం నుంచి భారీ వాహనాల వరకు ఎంత శబ్దం ఉండాలో అవగాహనలేక ఎవరూ పాటించడం లేదు. ద్విచక్రవాహనం నుంచి త్రీ వీలర్ వరకు 80 డెసిబుల్ శబ్దం, ట్యాక్సీలకు 82, కమర్షియల్ వాహనాలకు 4ఎంటీ నుంచి 12 ఎంటీ వరకు 89 డెసిబుల్స్, ఆతర్వాత 12నుంచి 91 డెసిబుల్స్ మాత్రమే రావాలి.

90 వాహనాలు సీజ్

2022 నుంచి 2023 ఆగస్టు వరకు నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దాలు, అదనపు సైలెన్సర్లు బిగించి ప్రజలకు ఇబ్బంది కలిగించిన 90 ద్విచక్ర వాహనాలను మంచిర్యాల పోలీసులు సీజ్ చేశారు. సంబంధిత వాహనాల యజమానులకు జరిమానా విధించారు. సైలెన్సర్లు, హారన్లు మారుస్తున్న మెకానిక్‌లకు నోటీసులు జారీ చేశారు. మరోసారి అదే వాహనం పట్టుబడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచాం



కొంతమంది యువత సరికొత్త మోడళ్ల వాహనాలు కొనుగోలు చేసి వాటి హారన్లు, సైలెన్సర్లు మారుస్తున్నారు. ఇలాంటివారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఇప్పటి వరకు 90 కేసులు నమోదు చేశాం. రహదారులపై బైక్‌లతో ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలి.

– నరేష్ కుమార్, ట్రాఫిక్ సీఐ, మంచిర్యాల

30లోగా గిరిజన ఉద్యోగుల సంఘం ఎన్నికలు


మాట్లాడుతున్న భాస్కర్‌రావు

మందమర్రిరూరల్: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ కమిటీ ఎన్నికలు ఈ నెల 30లోగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించినట్లు సంఘం అధ్యక్షుడు అంగోతు భాస్కర్‌రావు తెలిపారు. ఆదివారం మందమర్రిలోని సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సింగరేణి స్థాయి బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో చీఫ్ లైజన్ ఆఫీసర్ వీసం కృష్ణయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20లోగా సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో గిరిజన ఉద్యోగుల సభ్యత్వం పూర్తి చేయాలని, ఇదివరకు ఉన్న రెండు సంఘాలను ఒక్కటిగా చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఆ సంఘం సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి భుక్యా నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దారావత్ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ తిరుమల్‌రావు, లైజన్ ఆఫీసర్ బాబు జాదవ్, ఏరియా బ్రాంచ్ నాయకులు రవికుమార్, తిరుపతి, తారాచంద్, నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆస్నాద వాసికి జాతీయ పురస్కారం


అవార్డు అందుకుంటున్న నరసింహాచారి

చెన్నూర్‌రూరల్: సూక్ష్మ కళారంగంలో విశిష్ట సేవలందించిన చెన్నూర్ మండలం ఆస్నాదకు చెందిన ఏలేశ్వరం నరసింహాచారి జాతీయ పురస్కారం అందుకున్నారు. అఖిల భారత విశ్వకర్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలోని విశ్వబ్రాహ్మణ కళాక్షేత్రంలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 38 మందికి ఆదివారం జాతీయ, లెజెండరీ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ ట్రస్ట్ ఏపీ నిర్వాహకులు మాచవరం గౌరీశంకర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంతాచారి, బాల బ్రహ్మచారి, వంగిరపు వీర బ్రహ్మచారి సిద్ధాంతి, తదితరులు పాల్గొన్నారు.

గతంలో అవార్డులు..

నరసింహాచారి 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ సూక్ష్మ కళాకారుడు అవార్డు అందుకున్నారు. 2016లో ఆసియా తెలుగు బుక్ అవార్డుకు స్థానం సంపాదించి పలువురి ప్రశంసలు పొందారు.

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో ఐసెట్ కౌన్సెలింగ్ ఆదివారం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఐసెట్ పరీక్షలో విద్యార్థులు సాధించిన ర్యాంకు ఆధారంగా కౌన్సెలింగ్‌కు పిలిచారు. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. తర్వాత విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తొలిరోజు 215 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

మన సంస్కృతిని కాపాడుకుందాం

- ప్రొఫెసర్ జాడి మునలయ్య


మాట్లాడుతున్న ముసలయ్య

జన్నారం: మారుతున్న కాలంతోపాటు మన సంస్కృతి సంప్రదాయాలు మారకుండా కాపాడుకుందామని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాడి ముసలయ్య, ఎస్ఈ జాడి శంకర్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో ఆదివారం పొలాల అమావాస్య పండుగ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పూర్వీకులు నేత అనే వృత్తిని దైవంగా భావించి ప్రకృతిని పూజించేవారన్నారు. పొలాల అమావాస్య రోజు నేతకాని పూర్వీకులు పితృతర్పణం చేసేవారని, ఎద్దులను పూజించేవారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దానిలో కొంత సమాజ అభివృద్ధికి వెచ్చించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న మురిమడుగుల రమేశ్‌తోపాటు రాజయ్య, దుర్గం శ్రీనివాస్, తుంగూరి వెంకటరాజంను సన్మానించారు. కార్యక్రమంలో నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్వర్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న, సర్పంచ్ గంగాధర్, నాయకులు రాయమల్లు, గోపాల్, ప్రభుదాస్, రాంటెంకి శ్రీనివాస్, తుంగూరు గోపాల్, జాడి మురళి, రాజేశ్వర్, పోషలింగం, రత్నం, లక్ష్మణ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'శాంతిఖని'ని సందర్శించిన డీడీఎంఎస్


గనిపై డీడీఎంఎస్, అధికారులు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిని ఆదివారం డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) రాజీవ్ ఓం ప్రకాష్ వర్మ సందర్శించారు. గనికి విద్యుత్ సరఫరా అందించే సబ్‌స్టేషన్‌ల పనితీరును పర్యవేక్షించారు. గని భూగర్భంలోకి దిగి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న బోల్టర్ మైనర్ (బీఎం) యంత్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట పీవో విజయప్రసాద్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, శాంతిఖని గ్రూపు ఇంజనీర్ బసవరాజు, వర్క్‌షాప్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, రక్షణాధికారి రాజు, పిట్ ఇంజనీర్ రాంబాబు, తదితరులు ఉన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకెళ్లాలి


ఐక్యత చాటుతున్న నాయకులు

నస్పూర్: మంచిర్యాల నియోజకవర్గంలో బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకెళ్లాలని బీసీ సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమాలోచన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఓట్ హమారా–సీట్ తుమారా, నహీ చలేగి–నహీ చలేగి' అనే నినాదంతో ముందుకెళ్తామన్నారు. బీసీ రాజ్యాధికార సాధనకోసం నేడు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో చేపట్టనున్న రిలే నిరాహారదీక్షకు బీసీలు, మైనార్టీలు, ఎస్సీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్లు ముఖేష్ గౌడ్, తోట శ్రీనివాస్, బీజేపీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ అగల్‌డ్యూటి రాజు, బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్, రంగు రాజేశ్, మొండయ్య, రాజ్‌కిరణ్, నాలి శ్రీనివాస్ డాక్టర్ రఘునందన్, రూపాదేవి, ఆకుల అశోక్, సోమన్న, రవూఫ్, మల్లయ్య, చేరాలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాబారిన పడకుండా రెవెన్యూ అధికారులు చాకచక్యంగా వ్యవహరించారు. ఈ ఘటన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని 198, 199 సర్వే నంబర్లలో ఉన్న రెండెకరాల 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన కొంత మంది ఉదయం నుంచి ప్రభుత్వ స్థలాన్ని ట్రాక్టర్‌తో చదును చేస్తున్నట్లు తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు సమాచారం అందింది. వెంటనే నాయబ్ తహసీల్దార్ హరిత, మండల సర్వేయర్ కృష్ణప్రియ, గిర్దావర్లు ప్రభు, మంగతో కలిసివెళ్లి పరిస్థితి సమీక్షించారు. ప్రభుత్వ భూమిని ఎలా చదును చేస్తున్నారని ప్రశ్నించిన అధికారులు కబ్జాదారుల సమాధానం విని ఖంగుతిన్నారు. కరీంనగర్‌కు చెందిన వేణు అనే వ్యక్తి భూమి అమ్మాడని పాస్‌బుక్, పహాణీలు చూపించారు. భూమి కొనుగోలుకు అంగీకారం కుదరడంతో కొంత బయానా కూడా ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులకు తెలిపారు. చదును చేస్తున్న భూమి పట్టా కాదని ప్రభుత్వ భూమి అని అధికారులు వివరంగా చెప్పడంతో వెనుదిరిగారు.

మళ్లీ రెనోవేషన్ కమిటీనే..!

- 14 మందితో ఆలయ కమిటీ సభ్యుల నియామకం


విశ్వనాథ ఆలయం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల విశ్వనాథ ఆలయ రెనోవేషన్ కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ చైర్మన్ లేకుండా రెనోవేషన్ కమిటీ సభ్యులతో సరిపెట్టారు. నిర్ణయాధికారం లేని 14 మందితో కమిటీ వేశారు. కమిటీలో ముఖేశ్, బ్రహ్మయ్య, ఈర్ల లచ్చన్న, వోడ్నాల రవీందర్, మాధవరపు శృతి, జాడి కళ, అంజయ్యయాదవ్, బాలరాజు, సుధాకర్, రాజబాబురెడ్డి, సురేందర్, రాజేశం, రామగిరి రాజబాబు, ఓం ప్రకాశ్ సభ్యులుగా నియమించారు.

పోరాట యోధులను విస్మరించిన ప్రభుత్వం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్


మాట్లాడుతున్న కలవేన శంకర్

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను విస్మరించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు వారోత్సవాలు అధికారికంగా నిర్వహిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం 4500 మంది పోరాట యోధుల త్యాగాన్ని, అమరత్వాన్ని మరిచిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే నైతికత బీఆర్ఎస్ పార్టీకి లేదన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. 17న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 50 వేల మందితో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 33 జిల్లాలకు చెంది సీపీఐ నాయకులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకలదాసు, పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు ముస్కె సమ్మయ్య, కొట్టే కిషన్‌రావు, చాడ మహేందర్‌రెడ్డి, కుంచాల శంకరయ్య, రామన్న పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


భీమయ్య(ఫైల్)

భీమిని: ఈ నెల 7న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. కన్నెపల్లి మండలంలోని రెబ్బెన గ్రామానికి చెందిన మానేపల్లి భీమయ్య (45)కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. సోదరుడు బానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిరూరల్: నిరుద్యోగ యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన మేరుగు గణేశ్ అనే యువకుడికి టెలిగ్రామ్ యాప్ ద్వారా పార్ట్ టైం జాబ్ పేరుతో మెసేజ్ వచ్చిందన్నారు. ముందుగా రూ.వెయ్యి పెట్టుబడి పెడితే రూ.300లు అదనంగా వస్తాయని తెలుపడంతో రూ.వెయ్యి పెట్టుబడి పెట్టగా రూ.13 వచ్చాయన్నాడు. ఆ తర్వాత రూ.3వేలు పెడితే 3,900లు, రూ.20వేలు, రూ.65 వేలు, రూ.1.50లక్షలు, రూ.2.50 లక్షలు.. ఇలా రూ.6.15 లక్షలు పెట్టుబడి పెట్టాడన్నారు. కళ్యాణ్ అనే మరో యువకుడు రూ.23 వేలు పెట్టుబడి పెట్టి తిరిగి డబ్బులు రాక మోసపోయాడన్నారు. మోసపోయామని గ్రహించిన యువకులు సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయగా ఆదివారం మందమర్రి ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యువకులు సైబర్ క్రైంకు గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

మంచిర్యాలటౌన్: వాలీబాల్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా మరోసారి నల్ల శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మైలారం శ్రీనివాస్, కోశాధికారిగా గాజుల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అబ్జర్వర్ మల్లేశ్‌గౌడ్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ కనపర్తి రమేశ్ వ్యవహరించారు. సమావేశంలో జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, క్రీడా సంఘాల నాయకులు, వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో బావమరిదిపై కర్రతో దాడి

- చికిత్స పొందుతూ యువకుడు మృతి


భరత్(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): తాగిన మైకంలో బావమరిదిపై కర్రతో దాడి చేసిన ఘటనలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోయంగూడకు చెందిన సోయం భరత్(23) బావవరుసైన తిర్యాణి మండలం మాదారం గ్రామానికి చెందిన పర్చాకి రాంషావుతో కలిసి శుక్రవారం ద్విచక్రవాహనంపై కెరమెరి మండలంలోని సాకెడ గ్రామానికి వెళ్లారు. ఇంటికి వచ్చే క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఆవేశానికి గురైన రాంషావు పక్కనే ఉన్న కర్రతో భరత్‌పై దాడి చేశాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడే కుప్పకూలాడు. ఎస్సీ కాలనీకి చెందిన రత్నం గోపి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినందుకే గొడవ..!

గ్రామస్తులు, మృతుని బంధువులు తెలిపిన సమాచారం ప్రకారం.. రాంషావు మామకు పక్షవాతం ఉండడంతో భరత్‌ను తోడుగా తీసుకుని చెట్లమందుకోసం సాకెడకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. వాంకిడి సమీపంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడడంతో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇద్దరూ కలిసి కాలి నడకనే బయలుదేరారు. అయితే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడటానికి కారణం నువ్వేనంటూ భరత్ తన బావ అయిన రాంషావును నిందించాడు. మాటా మాట పెరిగి గొడవకు దారి తీసింది.

కాంగ్రెస్‌కు ఓటువేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్లే


బీజేపీలో చేరిన వారితో రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీఆర్ఎస్ పార్టీకి వేసినట్లేనని, ఆ రెండు పార్టీలు ఒక్కటేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వెయ్యి మంది యువకులు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో రఘునాథ్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు కేసీఆర్ కుటుంబానికి బానిసలుగా మారారని అన్నారు. జిల్లా నిధులను ఇతర జిల్లాలకు తరలిస్తున్నా నోరు మెదపడం లేదని తెలిపారు. సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ నుంచి నడిపెల్లి దివాకర్‌రావుకు టికెట్ ఇవ్వగా, కాంగ్రెస్ నుంచి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు టికెట్, డబ్బులు ఇచ్చి పోటీలో నిలబెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నుంచి ఎవరు గెలిచినా, బీఆర్ఎస్‌లో చేరడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావుకు కమీషన్లను దండుకోవడంలో ఉన్న శ్రద్ధ, మంచిర్యాల అభివృద్ధిపై లేదని విమర్శించారు. మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే, పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. పానుగోటి రంగారావు, రజనీశ్‌జైన్, మునిమంద రమేశ్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, తిరుపతి, బియ్యాల సతీశ్‌రావు, పట్టి వెంకటకృష్ణ, ముదాం మల్లేశ్, బోయిని హరికృష్ణ, గాజుల ప్రభాకర్, కొట్టి నాగేశ్వర్‌రావు, పచ్చ వెంకటేశ్వర్లు, రాకేశ్ రెన్వా పాల్గొన్నారు.

ఆత్మహత్యలకు పాల్పడడం సరికాదు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మంచిర్యాలటౌన్: జీవితంలో ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలకు భయపడి ఆత్మహత్యలకు పాల్పడడం సరికాదని, సమస్యలు ఎదుర్కొనేందుకు పోరాడడమే గొప్ప అని సైకాలజిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సాయికుంట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో రాణించలేకపోతున్నామని, ఉద్యోగం రాలేదని, తల్లిదండ్రులు మందలించారని, ఎవరో అవమానించారని, తల్లిదండ్రులు మొబైల్ కొనివ్వలేని ఇలాంటి చిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతి నారాయణరావు, జిల్లా కార్యదర్శి చెరుకు సుధాకర్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.సత్యనారాయణ, జిల్లా మహిళా కార్యదర్శి సుమన చైతన్య, సైకాలజిస్టు రంగు వేణుకుమార్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి మల్లారెడ్డి పాల్గొన్నారు.